15న ఖాద్రీశుడి పార్వేటోత్సవం



కదిరి, జనవరి12 (ఆంధ్రజ్యోతి): మకర సంక్రాంతి సందర్భంగా ఈనెల 15న కదిరి లక్ష్మీనరసింహస్వామి పార్వేటోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాసు రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 15న ఉదయం శ్రీవారికి నిత్యపూజలు చేస్తారన్నారు. 9 గంటలకు ఆలయం నుంచి శ్రీవారి శోత్రి (కదిరి) కొండ కిందకు చేరుట, 9 నుంచి మధ్యాహ్న 2 గంటల వరకు స్వామివారికి పూజ, నివేదన, ప్రసాదాలు, మధ్యాహ్నం 2నుంచి 3వరకు పాలు ఆరగింపు మండపం చేరి, పాల నివేదన వినియోగం, 3నుంచి 4వరకు పార్వేటోత్సవం, అనంతరం స్వామివారు అక్కడి నుంచి శమి మండపం చేరుతారన్నారు. సాయంత్రం 5 నుంచి స్వామివారు అశ్వావాహనంపై కదిరి పురవీధుల్లో విహరిస్తారన్నారు. రాత్రి 9 నుంచి 9.30 గంటల వరకు ఆలయ ముఖద్వారం వద్ద చోరసంవాదం, హారతితో ఉత్సవం ముగుస్తుందని ఈఓ వెల్లడించారు.

యువత చేతిలో దేశ భవిష్యత్తు

స్వామి వివేకానంద స్ఫూర్తితో రాణించాలి
మంత్రి సత్యకుమార్ యాదవ్



మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే యువకుల జనాభా అత్యధికంగా ఉన్నది భారత్‌లోనేననీ, వారి చేతిలోనే దేశ భవిష్యత్తు ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక రేగాటిపల్లి రోడ్డులోగల వివేకానంద డిగ్రీ కళాశాలలో జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ... ప్రపంచానికి భారత ఔన్నత్యాన్ని చాటిచెప్పి, అంతర్జాతీయ స్థాయిలో సనాతన ధర్మాన్ని పరిచయం చేసిన వ్యక్తి స్వామి వివేకానంద అన్నారు. ఆయన స్ఫూర్తితో యువత రాణించాలన్నారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు సివిల్స్‌లో ఉచిత శిక్షణ ఇప్పిస్తున్నామన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు

- మంత్రి సవిత



గోకులం షెడ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సవిత

గోరంట్ల, జనవరి12(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పరంగా రాష్ట్రం పరుగులు పెడుతోందని బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖమంత్రి సవిత పేర్కొన్నారు. మండలంలోని తప్పరాజుపల్లిలో రూ.2.30లక్షల ఉపాధి నిధులతో నిర్మించిన గోకులం షెడ్‌ను మంత్రి ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. అన్నివర్గాల అభివృద్ధితోపాటు మహిళలు, రైతుల సంక్షేమ కోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. పాడిపరిశ్రమ అభివృద్ధి ద్వారా రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యమన్నారు. ఆ దిశగా గోకులం షెడ్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. గ్రామాల్లో సీసీరోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణం చేపడుతున్నామన్నారు. వైసీపీ పాలనలో ఉద్యోగులకు జీతాలు సకాలంలో అందేవికావన్న విషయం అందరికీ తెలుసన్నారు. సర్పంచ్‌లకు నిధులు కూడా ఇవ్వకుండా లాగేసుకున్నారన్నారు. కూటమి పాలనలో సర్పంచ్‌లకు గౌరవ మర్యాదలు అందేలా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. 85వేల మంది మహిళలకు ఫ్యాషన్ డిజైనింగ్ శిక్షణ ఇస్తూ, ఉచితంగా కుట్టుమిషన్లను అందజేస్తున్నామన్నారు. పాలనలో విఫలమైన వైసీపీ ఉనికిని చాటుకోవడానికి శవ రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. అనంతరం రూ.1.14 కోట్లతో ఎర్రయ్యగారిపల్లి నుంచి మేరెడ్డిపల్లి వరకు చేపడుతున్న తారు రోడ్డు నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ శివానందనాయక్, ఎంపీడీఓ నరేంద్రకుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రౌడీయిజం చేస్తే తాటతీస్తాం..

పురంలో కత్తి కల్చర్‌పై ఎస్పీ ఆగ్రహం
రౌడీషీటర్లకు కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్పీ

హిందూపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): కత్తులు వెంట పెట్టుకుని రౌడీయిజం చేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదనీ, అలాంటి వారికి తాటతీస్తామని ఎస్పీ రత్న హెచ్చరించారు. పురంలో వరుస కత్తి దాడులపై 'పురంలో కత్తి కల్చర్' శీర్షికన ఈనెల 10న 'ఆంధ్రజ్యోతి' కథనం ప్రచురించిన విషయం విదితమే. దీనిని ఎస్పీ సీరియస్‌గా పరిగణించారు. శనివారం టీడీపీ నాయకులపై కత్తితో దాడి చేయడంతో పోలీసులు ఉలిక్కిపడ్డారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఎస్పీ ఆదివారం పట్టణానికి వచ్చారు. పట్టణం, రూరల్ మండలంలోని రౌడీషీటర్లు, పాతనేరస్తులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్పీ మాట్లాడుతూ.. హిందూపురంలో రౌడీయిజం చేయాలని చూస్తే జిల్లా వదిలిస్తామన్నారు. కొంతమంది ఆత్మరక్షణ పేరుతో కత్తులు పెట్టుకుని తిరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాంటివారిని గుర్తించి, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. భూపంచాయితీలు, దందాలు చేసేవారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు. నేరాల నియంత్రణలో భాగంగా జిల్లాలో ప్రతి సబ్‌డివిజన్‌కు రెండు డ్రోన్లు కేటాయించామనానరు. మార్చిలోపు జిల్లావ్యాప్తంగా రూ.3వేల సీసీ కెమెరాలు అమర్చుతున్నట్లు తెలిపారు. పట్టణంలో ప్రవేశించే రహదారులు, సర్కిళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. హిందూపురంలోని ట్రాఫిక్ పోలీసు స్టేషన్ వద్ద సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్పీ వెంట ఇన్‌చార్జి డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐలు రాజగోపాల్‌నాయుడు, ఆంజనేయులు, జనార్దన్, అబ్దుల్‌కరీం, ఎస్బీ ఎస్‌ఐ ప్రదీప్, చిలమత్తూరు ఎస్‌ఐ మునీర్‌అహ్మద్ ఉన్నారు.



గ్రామాల్లో కుశల ప్రశ్నలతో గడుపుతున్న జనం



బెంగళూరు నుంచి కదిరికి బస్సుల్లో వచ్చిన జనం



కొక్కంటి క్రాస్‌లో వేచివున్న జనం

సంక్రాంతి శోభ

సొంతూరికి చేరిన జనం
పల్లెపట్నంలో సందడి... నేడు భోగి

పుట్టపర్తి, జనవరి12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. పండుగకు జనం సొంతూరికి చేరుతున్నారు. సోమవారం భోగి నేపథ్యంలో పల్లెపట్నంలో సందడి కనిపించింది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి ఉద్యోగ వ్యాపార, ఉపాధి నిమిత్తం బెంగుళూరు, హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాలకు భారీగా ఏటా వెళ్తారు. సంక్రాంతి పండుగ కోసం వారంతా ఆదివారం సాయంత్రానికల్లా స్వగ్రామాలకు చేరుకున్నారు. దీంతో బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు కిటకిటలాడాయి. పండగకు ఆర్టీసీ జిల్లాలో ప్రత్యేక బస్సులు నడుపుతోంది. భోగి పండుగ నేపథ్యంలో దుస్తులు, సరుకులు, రంగులు, పూజాసామగ్రి కొనుగోళ్లతో పట్టణాల్లో ప్రధాన వీధులు కిక్కిరిశాయి. జనం బిజీబిజీగా కనిపించారు.

పల్లెపట్నంలో ముచ్చట్లు

సంక్రాంతి పండగ నేపథ్యంలో బంధుమిత్రులు, ఉద్యోగ వ్యాపార, వలస వెళ్లిన వారు సొంతూర్లకు రావడంతో పల్లెల్లో ముచ్చట్లు కనిపించాయి. గ్రామాల్లో బంధుమిత్రులతో సందడి కనిపించింది. రచ్చబండల వద్ద కుశల ప్రశ్నలతో గడిపారు. ఇళ్ల లోగిళ్లలో మహిళలు ముగ్గులు వేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు.

పతంగులతో జాగ్రత్త

గతేడాది చిలమత్తూరు మండలంలో సంక్రాంతి సందర్భంగా చైనా మంజా దారంతో కూడిన గాలిపటాన్ని మేడపై ఎగురవేస్తూ ఓ వ్యక్తి పరుగెడుతున్న సమయంలో కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కాగా.. ఆస్పత్రికి తరలించి చికిత్సలు అందించారు.

రెండేళ్ల క్రితం హిందూపురం పట్టణంలోని ప్రధాన రహదారిలో గాలిపటం ఎగురవేసే సమయంలో అటుగా వెళ్తున్న ద్విచక్రవాహనదారుని మెడకు చుట్టుకుని కిందపడి తీవ్ర గాయాలయ్యాయి. ఇలాంటివి చాలానే జరిగాయి. గుట్టుచప్పుడు కాకుండా ఆస్పత్రిలో చేరి చికిత్సలు పొందారు.

ప్రాణాలను హరిస్తున్న చైనా మంజా దారం
గాలిపటాలు ఎగురవేసే సమయంలో ప్రమాదాలు
అప్రమత్తంగా లేకపోతే అంతే సంగతులు



హిందూపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి అంటేనే మొదట గుర్తొచ్చేది గాలిపటాలు. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ఈ పండుగలో పతంగులు ఎగురవేయడం సంప్రదాయం. ఆకాశంలో విహరించే పతంగులు.. పక్షులు, మనుషులకు ప్రమాదకరంగా మారుతున్నాయి. పక్షుల రెక్కలకు, మనుషులకు చుట్టుకుని ప్రాణాపాయం తెచ్చి పెడుతున్నాయి. సంక్రాంతి వేళ ఆనందాలు నిండాలి తప్ప.. విషాదం కాకూడదు. గాలిపటాల ఆట సరదాకావాలి కానీ.. కుటుంబాలు తెగిన గాలిపటం కాకూడదు. మార్కెట్‌లో వచ్చే మంజాలు ప్రాణాలపై పంజా విసురుతున్నాయి. పిల్లల గొంతులు కోస్తూ జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయి.

జాగ్రత్తలు తప్పనిసరి

జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో గాలిపటాలు ఎగురవేయడం సరికాదు. గాలిపటాలకు ఉపయోగించే దారం రోడ్డుకు అడ్డంగా పడితే వాహనచోదకులు ప్రమాదాల బారిన పడతారు. గాలిపటం దారం తెగి కిందపడుతుంటే పైకి చూస్తూ పరుగెత్తరాదు. తల్లిదండ్రులు, సంరక్షకులు వారి వెంటే ఉంటే మంచిది. ముఖ్యంగా చిన్న పిల్లలు, మేడలపై ఎక్కి వాటి వెంట పరుగెడుతూ ప్రాణాలపైకి తెచ్చుకుంటున్నారు. ఆడుకునే సమయంలో పెద్దల పర్యవేక్షణ తప్పనిసరి.

- గాలిపటాలు, విద్యుత్ తీగలు చెట్ల కొమ్మలు ఇరుక్కుంటే వాటిని తీసే సాహసం చేయరాదు. వాటిని అలాగే వదిలివేయడం చాలా మంచిది.
- గ్లాస్ కోటింగ్‌తో కూడిన నైలాన్ సింథెటిక్ దారాన్ని కూడా కొందరు వాడుతుంటారు. ఈ దారం కూడా ప్రమాదకరమైంది. పక్షులు ఇందులో ఇరుక్కుని చనిపోతుంటాయి. మనుషుల మెడ, చేతులు, కాలికి రాసుకుపోయినా గాయాలపాలవుతారు. జనసంచారంలేని ప్రాంతాలు, క్రీడామైదానాల్లో పతంగులు ఎగుర వేయడం మంచిది.

పక్షులు చనిపోతే జరిమానా

గాలిపటాలు ఎగుర వేసేందుకు అత్యధికంగా ఇటీవల కాలంలో చైనా మంజా వాడుతున్నారు. దీనివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని విక్రయాలపై ప్రభుత్వం నిషేధం విధించింది. ఎగురవేసే సమయంలో చిన్న పిల్లల వేలికి గాయాలవుతున్నాయి. ఈ దారం పక్షులకు తగిలినా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ప్రజలు, పశువులకు సైతం ఈ దారంతో ప్రాణాపాయం పొంచి ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని, కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చైనా మంజా వల్ల పక్షులు చనిపోతే ఆ గాలిపటం ఎగురవేసిన వ్యక్తికి మూడు నుంచి ఏడేళ్లపాటు జైలుశిక్షగానీ, రూ.10వేలు జరిమానాగానీ విధించవచ్చు. కొన్ని ప్రాంతాల్లో ఈ దారాన్ని గుట్టు చప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు.

సరదా.. సంతోషం నింపాలే తప్ప..:



రాజగోపాల్‌నాయుడు, సీఐ, వన్‌టౌన్

సంక్రాంతి పండగలో అందరూ సంతోషంగా ఉండాలే తప్ప.. గాలిపటాలు ఎగురవేసే సమయంలో ప్రమాదాలు జరిగి విషాదం నింపరాదు. జనంలేని ప్రాంతాల్లో పట్టణం, పల్లెల బయట పతంగులు ఎగురవేయాలి. మేడపై ఎక్కి ఎగురవేయడం ప్రమాదం. గాలిపటాలకు చైనా మంజా దారం ఉపయోగించరాదు. దీనిపై ప్రభుత్వం నిషేధం విధించింది. చిన్నపిల్లలు పతంగులు ఎగురవేసే సమయంలో జాగ్రత్తలు వహించాలి.

పశువులకు పంట..!

దారుణంగా పడిపోయిన టమోటా ధరలు
రవాణా చార్జీలు కూడా రాని దుస్థితి
పశువులకు వదిలేసిన రైతులు
పెట్టుబడి, కష్టం.. మట్టిపాలు

ఓబుళదేవరచెరువు, జనవరి12(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి, రూ.లక్షలు పెట్టుబడులు పోసి పండించిన పంటను రైతు అమ్ముకోలేకపోతున్నాడు. టమోటా ధరలు పాతాళానికి పడిపోయాయి. అప్పులు చేసి రైతు పంట సాగుచేశాడు. తీరా దిగుబడి వచ్చే సమయానికి ధరలు లేకపోవడంతో సర్వం నష్టపోతున్నాడు. దీంతో గత్యంతరం లేక పశువుల మేతకు పంటను వదిలేయాల్సిన దుస్థితి టమోట రైతులకు దాపురించింది. మండలవ్యాప్తంగా దాదాపు 150 ఎకరాల్లో టమోటా పంటను రూ.లక్షలు ఖర్చుపెట్టి, సాగుచేశారు. తీరా పంట చేతికొచ్చే సమయానికి ధరలు లేకపోవడంతో రైతుల ఆశలు అడియాసలయ్యాయి. పంట కోతకు కూలీకి రూ.400 చొప్పున చెల్లించి, కాయలు తొలగించి, తరువాత రవాణాకు బాక్సుకు రూ.30 చెల్లించాల్సి వస్తోంది. ఎకరాలో పంట సాగుచేయాలంటే పైరు, కట్టెలు, ఎరువులు, ఇతర ఖర్చులకు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చవుతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో 15 కేజీల బాక్స్ రూ.40కి మించి ధర పలకడంలేదు. ఈ రేటుతో విక్రయిస్తే కనీసం రవాణా ఖర్చులు కూడా రావని అన్నదాతలు వాపోతున్నారు. దీంతో చేసేదిలేక పంటను పశువులకు వదిలేశారు.

> 15 కిలోల బాక్సును మార్కెట్‌కు తరలించడానికి అయ్యే రవాణా చార్జీలు రూ.30..
> మార్కెట్‌లో ధర రూ.40..
> పంటను అమ్మితే వచ్చే డబ్బు వాహన బాడుగకు సరిపోతుంది..
> ఇదీ టమోటా రైతుల దుస్థితి..
> పంట పెట్టుబడులు..
> రైతు కష్టం.. అన్నీ మట్టిపాలు..
> కూలీల ఖర్చులు కూడా రావని..
> కోయడం కూడా వృథా అని..
> పంటను పశువులకు వదిలేశాడు అన్నదాత..

పొలాల్లోనే పంట..

ఎకరాలో టమోటా సాగు చేయడానికి రూ.80 వేల నుంచి రూ.లక్ష ఖర్చవుతుంది. కట్టెలు కట్టి తీగల పద్ధతిలో టమోను సాగుచేస్తున్నారు. నేల పద్ధతిలో సాగుచేస్తే ఎకరాకు రూ.40 నుంచి 60వేలు పెట్టుబడి అవుతోంది. పంట దిగుబడి వచ్చే సమయానికి ధరలు లేకపోవడంతో ఏమిచేయాలతో దిక్కుతోచని స్థితిలో రైతులు అలాగే వదిలేస్తున్నారు. గత నెలలో ధరలు పతనం కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. డిసెంబరు చివరి వారం తరువాత ధరలు క్రమేణా తగ్గుముఖం పట్టా యి. ప్రస్తుతం 15 కిలోల బాక్సు రూ.40 ధరతో అమ్ముడుపోతోంది. దీంతో రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు.



టమోటాకు ధర లేకపోవడంతో పశువులకు వదిలేసిన దృశ్యం



అప్పులు పెరిగాయి
- పి.రామప్ప, రైతు, బండకిందపల్లి

అప్పులు చేసి రూ.80 వేలు పెట్టుబడి పెట్టి ఎకరాలో టమాట సాగుచేశా. దిగుబడి ఆశాజనకంగా వచ్చింది. ధరలు లేకపోవడంతో కనీసం రవాణా ఖర్చులకు కూడా రాలేదు. దీంతో పశువుల మేతకు పంటను వదిలేశా. అప్పులు మరిన్ని పెరిగాయి.



పొలంలోనే వదిలేశా
- నజీర్, రైతు, సల్లావాండ్లపల్లి

మూడెకరాల్లో రూ.3లక్షల వరకు ఖర్చుపెట్టి టమోటా సాగు చేశా. దిగుబడి ఆశాజనకంగా వచ్చింది. ధరలు లేవు. చేసేదిలేక పొలంలోనే పంటను పశువుల మేతకు వదిలేశా.



కారుణ్యమాత నాటికలోని సన్నివేశం

అలరించిన కారుణ్యమాత

పుట్టపర్తి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో సత్యసాయి హయ్యర్ సెకండరీ విద్యార్థులు ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన కారుణ్యమాత నాటిక భక్తులను అలరింపజేసింది. సంక్రాంతి నేపథ్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. తల్లిదండ్రులు.. పిల్లలపై చూపే ప్రేమ.. వృద్ధాప్యంలో వారి పట్ల పిల్లలు చేసే నిరాదరణను కళ్లకు కట్టారు. సత్యసాయి ప్రేమతత్వంతో ఎందరో పిల్లలు తమ తల్లిదండ్రులు ప్రేమను గుర్తించి ఆరాధ్యదైవంగా పూజిస్తున్నారంటూ నాటిక ద్వారా తెలియజేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఊరి బడికి ఊపిరి..!

ప్రాథమిక పాఠశాలలకు పూర్వవైభవం
జీవో 117 రద్దుకు విద్యాశాఖ శ్రీకారం
పంచాయతీకి ఒక మోడల్ ప్రైమరీ స్కూల్
రెండు నెలలపాటు క్షేత్రస్థాయిలో అధ్యయనం



జగన్ ప్రభుత్వంలో 117 జీవో రద్దు కోసం మాయదార్లపల్లిలో పాఠశాల గేటుకు కంపలుకొట్టి నిరసన తెలుపుతున్న గ్రామస్థులు, విద్యార్థులు (ఫైల్)

అనంతపురం విద్య, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్కూళ్లను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. ఈక్రమంలోనే ప్రైమరీ స్కూళ్ల పాలిట శాపంగా మారిన జీవో 117 రద్దుకు శ్రీకారం చుట్టింది. దాన్ని రద్దు చేసేందుకు మార్గదర్శకాలు జారీ చేసింది. గత ప్రభుత్వం ఊరి బడికి 117 జీవో ద్వారా ఉరి వేయడంతో విద్యార్థులు విలవిలలాడారు. ఈ జీఓ ద్వారా 3,4,5 తరగతులను విలీనం పేరుతో ఊరికి దూరంగా ఉన్న స్కూళ్లకు తరలించారు. దీంతో లక్షలాది మంది విద్యార్థులు, వందలాది మంది టీచర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ స్కూళ్ల మాన్పించారు. ఫలితంగా ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు తగ్గాయి. ఇదే క్రమంలో ప్రైవేట్ స్కూళ్లలో గణనీయంగా విద్యార్థుల సంఖ్య పెరిగింది. జీవో 117ను మెజార్టీ టీచర్లు, సంఘాలు వ్యతిరేకించాయి. అయినా నాటి జగన్ ప్రభుత్వం ముందుకెళ్లింది.

వివాదాస్పద జీవోపై జిల్లాలో పెద్దఎత్తున ఉద్యమం

గత ప్రభుత్వంలో తీసుకొచ్చిన జీవో 117 పై అనంతపురం జిల్లాలో పెద్ద ఎత్తున వ్యతిరేకత వ్యక్తమైంది. తమ పిల్లలు చదువుకునే ఊరి బడిని విలీనం పేరుతో చీల్చడంతో చాలా గ్రామాల్లో ప్రజలు నిరసనలకు దిగారు. కుందుర్పి మండలం మాయదార్లపల్లిలో గ్రామస్థులు, విద్యార్థులు, స్కూల్ గేటుకు కంపలు వేసి నిరసన తెలిపారు. 72 రోజులపాటు ఆందోళన కొనసాగించారు. దీంతో బసాపురం హైస్కూల్‌లో విలీనం చేసిన మాయదార్లపల్లి స్కూల్‌లోని 6,7,8 తరగతుల విషయంలో అధికారులు వెనక్కు తగ్గారు. యథావిధిగా అక్కడే కొనసాగేలా జిల్లా విద్యాశాఖాధికారులు ఉత్తర్వులిచ్చారు. ఇలా పదుల సంఖ్యల్లో గ్రామాల్లో ఇవే నిరసన లు వెల్లువెత్తాయి. అయినా అప్పటి ప్రభుత్వం మొండిగా ముందుకెళ్లడంతో జిల్లాలో సుమారు లక్ష మంది వరకూ విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఊరిలో ఉండే బడి నుంచి దూరంగా ఉండే స్కూళ్లకు వెళ్లాల్సి వచ్చింది. ఈ ఇబ్బందుల వల్లే టీచర్లు, సంఘాల నేతలు పెద్దఎత్తున ఆ జీవోను వ్యతిరేకించారు.

పంచాయతీలో ఒక మోడల్ ప్రైమరీ స్కూల్

కూటమి ప్రభుత్వం విద్యారంగంలో సంస్కరణలు, గత ప్రభుత్వ నిరంకుశ విధానాల దిద్దుబాటుకు శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా జీవో 117 రద్దు చేసేందుకు సిద్ధమైంది. కొత్తగా మార్పులు తీసుకురానున్నట్లు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈక్రమంలోనే ప్రతి పంచాయతీలో ఒక మోడల్ ప్రైమరీ స్కూల్‌ను ఏర్పాటు చేయనున్నారు. రెండు నెలల పాటు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయనున్నారు. ఇప్పటికే అన్ని జిల్లాల డీఈఓలకు మార్గదర్శకాలు జారీ చేశారు. ఈనెల 20 నుంచి కమిషనర్ సైతం జిల్లాల పర్యటనకు వస్తున్నారు. ఈనెల 24న అనంతపురం జిల్లాలో పర్యటించే అవకాశం ఉంది.

నాణ్యమైన విద్యకు ఊతం



ఒకటి నుంచి ఐదో తరగతి స్కూళ్లకు పూర్వ వైభవం రానుంది. ముఖ్యంగా బడుగు, బలహీనవర్గాలకు నాణ్యమైన విద్య చేరువకానుంది. గ్రామాల్లో విద్యార్థుల ఎన్‌రోల్ మెంట్ కూడా పెరుగుతుంది. మోడల్ ప్రైమరీ స్కూళ్ల ద్వారా ప్రజల్లో ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెరుగుతుంది. తరగతికి ఒక ఉపాధ్యాయుడిని ఉంచడం ద్వారా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి స్కూళ్లలో మరింత అవకాశం వస్తుంది.

-కరణం హరికృష్ణ, ఎన్టీఏ రాష్ట్ర అధ్యక్షుడు

మోడల్ ప్రైమరీతో జీవం



ప్రభుత్వం 117 జీవోను రద్దు చేయడంతో ప్రాథమిక విద్యావ్యవస్థకు జీవం పోసినట్లైంది. కూటమి ప్రభుత్వం ప్రతి పంచాయతీకి ఒక మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేయడంతోపాటు ఒక క్లాస్‌కు ఒక టీచర్‌ను ఇవ్వనుండటంతో పాఠశాలలు బలోపేతం అవుతాయి. జీవో రద్దు వల్ల అనేక మంది నిరుద్యోగులకు సైతం భవిష్యత్తులో ఉద్యోగావకాశాలు కలుగుతాయి.

-వెంకటరత్నం, జిల్లా ప్రధానకార్యదర్శి, ఆప్టా

అణచివేయాలని చూసినా..



గత ప్రభుత్వం జీవో 117 తీసుకురావడంతో ప్రాథమిక స్కూల్ వ్యవస్థ నిర్వీర్యమైంది. నాడు-నేడు కింద స్కూళ్ల కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేసి విలీనం పేరుతో 3,4,5 తరగతులను తరలించారు. దీంతో దూరంగా ఉండే స్కూళ్లకు కాలినడకన వెళ్లలేక... విద్యార్థులు బడి మానేశారు. గ్రామస్థులు, ప్రజలు, విద్యార్థులు నిరసనకు దిగితే ప్రభుత్వం నిరంకుశ పద్ధతుల్లో అణచివేయాల్సి చూసింది. కూటమి ప్రభుత్వం రద్దు చేయడం ఆనందంగా ఉంది.

-విజయభాస్కర్, రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీఎస్ఈఏ


అదనపు సెక్షన్ ఇవ్వాలి



కొత్త ప్రభుత్వం జీవో 117 రద్దు చేయడం మంచిదే. దీని వల్ల ప్రాథమిక స్కూళ్లు మళ్లీ జీవం పోసుకుంటాయి. అయితే ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల సంఖ్య తగ్గే అవకాశాలున్నాయి. దీనిపై మరింతగా అధ్యయనం చేసి...ఆ సమస్య రాకుండా చూడాలి. అదేవిధంగా హైస్కూళ్లలో సమాంతర మాధ్యమాన్ని అమలు చేయాలి. హైస్కూళ్లలో విద్యార్థుల సంఖ్య 35 దాటితే అదనపు సెక్షన్ మంజూరు చేయాలి.

- రమణారెడ్డి, జిల్లా ప్రధానకార్యదర్శి, ఎస్టీయూ

మెర్జింగ్ వల్ల ఏకోపాధ్యాయ స్కూళ్లు



గతంలో క్లాసులను విలీనం చేయడం వల్ల చాలా ప్రాథమిక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మిగిలాయి. కొన్ని స్కూళ్లు మూతపడ్డాయి. ముఖ్యంగా 3,4,5 తరగతులను హైస్కూళ్లలో విలీనం చేయడంతో స్కూల్ అసిస్టెంట్లపై పనిభారం పెరిగింది. ఇంకో వైపు ప్రైమరీ పిల్లలు హైస్కూళ్లలో ఇమడలేక ఇబ్బందులు పడ్డారు. 117 రద్దుతో ఈ సమస్యలకు ఫుల్‌స్టాప్ పడుతుంది. ప్రైమరీ స్కూళ్లలో విద్యార్థుల హాజరు పెరిగి మరింత బలపడతాయి.

-శ్రీనివాసులు, రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీఎస్టీఏ

డ్రాపౌట్స్ సంఖ్య తగ్గుతుంది



ఒక కిలోమీటరు దూరంలోని హైస్కూళ్లలో 3,4,5 తరగతులను విలీనం చేయడంతో విద్యార్థులు నడిచి వెళ్లేందుకు చాలా ఇబ్బందులు పడ్డారు. ఈ జీవో రద్దుతో ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల డ్రాపౌట్‌ల సంఖ్య తగ్గుతుంది. విద్యార్థులకు అందుబాటులో పాఠశాలల ఉండటం వల్ల నిత్యం విద్యార్థులు స్కూల్‌కు వస్తారు, పిల్లల హాజరుశాతం కూడా పెరుగుతుంది. విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది.

- గోవిందరాజులు, జిల్లా అధ్యక్షుడు, యూటీఎఫ్

రెండు మాధ్యమాలు కొనసాగించాలి



జీవో 117 రద్దు చేయనుండటం నిజంగా మంచి నిర్ణయం. దీని వల్ల ప్రైమరీ స్కూళ్లకు పూర్వ వైభవం వస్తుంది. యూపీ స్కూళ్లను హైస్కూళ్లగా అప్‌గ్రేడ్ చేయాలి. ప్రతి పాఠశాలలో తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాలను కొనసాగించాలి. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయాలి. దీని వల్ల ప్రైమరీ స్కూళ్లలో విద్యార్థులకు న్యాయం జరుగుతుంది.

- రామాంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆర్‌యూజేపీ

అంతా...రాయచూరే..!

- కర్ణాటకకు తరలుతున్న కంది దిగుబడి
- ఐదారుగురు కలిసి లోడెత్తుతున్న వైనం
- స్థానికంగా గిట్టుబాటు కాకపోవడమే కారణం
- ప్రైవేటు వ్యాపారులకు జడుస్తున్న రైతులు
- పక్క రాష్ట్ర మార్కెట్టే లాభదాయకం: అన్నదాతలు



కంది పంటను కోస్తున్న యంత్రం

విడపనకల్లు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): స్థానికంగా గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు వేల టన్నుల కంది పంటను కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్నారు. గత నాలుగేళ్లుగా పప్పుశనగ సాగు చేసి నష్టపోయిన ఉరవకొండ నియోజకవర్గ రైతులు ఈ సారి పంట మార్పిడిలో భాగంగా 80వేల ఎకరాలకు పైగా కంది పంటను సాగు చేశారు. అయితే పంట చేతికి వచ్చే సమయానికి గిట్టుబాటు ధర లేకపోవటంతో రైతులు తీవ్ర ఆందోళనలో మునిగిపోయారు. పంటను సాగు చేసిన రోజు నుంచి పురుగు మందులు, ఎరువులు, కోతల వరకూ దాదాపుగా ఎకరాకు రూ. 10వేలు పైనే పెట్టుబడి పెట్టినట్లు రైతులు పేర్కొ న్నారు. 'ఈ సారి మంచి ధరలు ఉంటాయి. ఎంతో కొంత అప్పు తీర్చుకోవచ్చు అని' రైతులు అనుకునే సమయానికి కంది కొనేవారే లేకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పండిన కంది పంటను స్థానిక వ్యాపారులకే ఇద్దామంటే వారు కళ్ల ముందే మోసం చేస్తున్నారు. బాదు తీసే పేరుతో 50 కేజీల బస్తాకు 3కేజీలు అదనంగా తీసుకుంటున్నారు. ఒక క్వింటాకు దాదాపుగా ఆరు కిలోల బాదు తీస్తారు. కందులను గ్రేడింగ్ చేసినా హమాలీ చార్జీలు, కాటా చార్జీ అంటూ, సరుకు బాగున్నా ఏదో ఒక పేరు పెట్టి బాదు పేరుతో దోచేస్తున్నారు. దీనికి తోడు రేటు కూడా అంతంతమాత్రమే ఉండటంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. అందుకే రైతులు వేల క్వింటాళ్ల కందులను కర్ణాటకకు తరలిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ మార్కెట్‌లో రైతులను వ్యాపారులు గౌరవిస్తు, బాదు కూడా క్వింటాకు అర కిలో, లేదా కిలో మాత్రమే తీసుకుంటున్నారు. అలాగే తూకాలు పూర్తి కాగానే లెక్కగట్టి నగదు ఇచ్చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఇక్కడి కంటే కర్ణాటకలో ధరలు కూడా బాగా ఉంటున్నాయని, అందుకే పంట దిగుబడిని అక్కడికే తరలిస్తున్నట్లు పలువురు రైతులు చెబుతున్నారు. గ్రామంలోని ఐదారుగురు రైతులు కలిసి ఓ లారీని అద్దెకు మాట్లాడుకుని, రాత్రికి లోడ్ చేసుకుని తెల్లారేసరికి మార్కెట్‌కు చేరుకుని విక్రయిస్తున్నారు.



పొలాల్లోనే కందులను రాసులుగా పోసుకున్న రైతులు

గ్రేడింగ్‌ను బట్టి ధర

రాయచూర్ మార్కెట్‌లో కందుల ధరను గ్రేడింగ్‌ను బట్టి నిర్ణయిస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. కందుల్లో 15శాతం తేమ ఉన్నా రూ. 8వేల నుంచి రూ.10వేల వరకూ ధరలు ఉంటాయి. అదే 20శాతం తేమ ఉంటే రూ. 6500 నుంచి రూ.7500 వరకూ ఉంటాయని పలువురు రైతులు చెబుతున్నారు. తేమశాతం అసలు లేని కందులను మార్కెట్ రేటు కంటే ఎక్కువ ధరలకు కొనుగోలు చేస్తారని, రాయచూర్ మార్కెట్ వెళ్లిన రైతులకు నష్టం అంటూ ఏమి ఉండదు అని పలువురు రైతులు చెబుతున్నారు. బళ్లారి మార్కెట్‌లోను మంచి ధరలు ఉన్నాయని, అయినా రైతులు అందరూ రాయచూర్ మార్కెట్ వైపే మొగ్గుచూపుతున్నారు. అయితే మన రాష్ట్రంలో మాత్రం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో 15 శాతం తేమ ఉన్నా కందులను తీసుకోరు. అసలు ప్రభుత్వ కంది కొనుగోలు కేంద్రాలు ఎక్కడున్నాయో కూడా తమకు తెలియదని రైతులు పేర్కొంటున్నారు. ఈ కేంద్రాల్లో ధర కూడా రూ.7550 మాత్రమే. ఇక బయట వ్యాపారులు కూడా కందులు చాలా బాగా ఉంటే రూ.8 వేలదాక ధర పెడతారని, అందుకే ఇక్కడి కంటే కర్ణాటకే మేలని రైతులు చెబుతున్నారు.



కందులను మిషన్‌కు వేసి గ్రేడింగ్ చేస్తున్న రైతులు

సరైన ధర ఏదీ..?: మహేష్‌బాబు, పెద్దకొట్టాలపల్లి



నేను 50 ఎకరాల్లో కంది సాగు చేశా. ఓ పది ఎకరాలు వరకూ జింకలు తిని పాడై పోయింది. మిగిలిన 40 ఎకరాల్లో కంది పంటను కోయించా. ఎకరాకు దాదాపు 3 నుంచి 4 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అయితే ఇక్కడ కందులకు సరైన ధర లేదు. ప్రభుత్వ మద్దతు ధర రూ. 7550 అంటే రైతులకు గిట్టుబాటు కాదు. కనీసం రూ. 9వేలకు పైగా ఉంటేనే అంతో ఇంతో గిట్టుబాటు అవుతుంది. అందుకే రాయచూర్ మార్కెట్‌కు కందులను తరలించేందుకు సిద్ధం చేసుకుంటున్నా. అక్కడ ధర బాగానే ఇస్తున్నారు. తేమశాతం లేని కందులకు దాదాపుగా రూ. 10వేలు పైగానే ఇస్తున్నారు.

ఇక్కడి వ్యాపారులకు ఇవ్వాలంటే భయం: రామకృష్ణ, మాళాపురం



పదెకరాల్లో కంది పంట సాగు చేశా. ఇక్కడ వ్యాపారులకు కందులను విక్రయించాలంటే భయంగా ఉంది. తూకాల్లోనే రైతులను మోసం చేసి క్వింటాకు 10 నుంచి 12 కేజీలు కాజేస్తున్నారు. ప్రభుత్వం కూడా సరైన మద్దతు ధర ఇవ్వలేదు. క్వింటా రూ. 7550అంటే మాకు ఏమి గిట్టదు. అందుకే ఏమి చేయాలో తెలియక కందులను పొలాల్లోనే ఆరబెట్టుకున్నాం. ప్రభుత్వం బయటి మార్కెట్ కంటే ఓ 500 ఎక్కువ ఇస్తే పక్క రాష్ట్రాలకు వెళ్లే పని ఉండదు.

రాయచూర్‌కు తీసుకెళ్తా: భుజంగం, మాళాపురం



నేను ఐదెకరాల్లో కంది పంట సాగు చేశా. దాదాపు ఎకరాకు 5 నుంచి 6 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కానీ ధరలు సరిగ్గా లేవు. ప్రభుత్వం క్వింటాకు ఏడు వేలు అంటోంది. బయట మార్కెట్‌లో ఎనిమిది వేలు మాత్రమే ఉంది. అదే కర్ణాటక రాష్ట్రంలో ఎనిమిది వేలకు పైనే ధరలు ఉన్నాయి. రాయచూరుకు వెళ్లటం అనేది వ్యయ ప్రయాసలతో కూడిన పని. అయినా రూపాయి మిగలాలంటే ఎంత దూరం అయినా వెళ్లాల్సిందే. అందుకే ఓ వారం రోజులు చూసి దిగుబడిని రాయచూర్‌కు తీసుకెళ్తా.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

-ఇద్దరికి గాయాలు

నల్లచెరువు, జనవరి12(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరో ఇద్దరు గాయపడిన ఘటన చోటు చేసుకుంది. ఆదివారం ఎస్ఐ మగ్బూల్‌బాషా తెలిపిన మేరకు నల్లచెరువు నుంచి నల్లజోడువారిపల్లికి ట్రాక్టర్‌లో ముగ్గురు వ్యక్తులు బియ్యం మూటలు తీసుకుని శనివారం రాత్రి వెళుతుండగా కాయలవాండ్లపల్లి బస్‌స్టాప్ వద్ద మదనపల్లి నుంచి అదిలాబాద్ వెళ్తున్న ఐషర్ వాహనం ఢీకొని వెళ్లిపోయిందన్నారు. ప్రమాదంలో నల్లజోడువారిపల్లికి చెందిన రామచంద్ర(54) అక్కడికక్కడే మృతిచెందగా, నరసింహులు, గంగన్నకు గాయాలైనట్లు తెలిపారు. విషయాన్ని కదిరికి సమాచారం ఇవ్వడంతో ఐషర్ వాహనాన్ని పట్టుకున్నట్లు చెప్పారు. గాయపడిన వారిని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రామచంద్రకు భార్య, ఇద్దరు పిల్లలున్నట్లు తెలిపారు.

టమోటా కిలో రూ.15

అనంతపురం రూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 15తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కా ర్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు ఆదివారం 675 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ. 12, కనిష్ఠ ధర రూ. 7 పలికినట్లు ఆయన తెలిపారు.

740 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆదివారం కృష్ణాజలాల ఇన్‌ఫ్లో 740 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్ఎస్ఎస్ ఫేజ్-2 కు 446 క్యూసెక్కులు వెళుతున్నాయన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని ఇంటర్ విద్యార్థి మృతి

అనంతపురం క్రైం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీ కొనడంతో ఇంటర్ విద్యార్థి మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి రూరల్ మండలంలోని కొడిమి సమీపంలో జరిగింది. అనంతపురం రూరల్ సీఐ శేఖర్ తెలిపిన మేరకు... రూరల్ మండలం నరసనాయనికుంటకు చెందిన రాజ్‌కుమార్‌నాయక్(18) అనంతపురం నగరంలోని జూనియర్ కళాశాలలో ఇంటర్‌మీడియట్ సెకెండియర్ చదువుతున్నాడు. తన సమీప బంధువులైన దామోదర్‌నాయక్, కార్తీక్ నాయక్‌తో కలిసి శనివారం రాత్రి గ్రామం నుంచి బైక్‌లో బయలుదేరారు. కొడిమి సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను వారి బైక్ ఢీ కొంది. దీంతో ట్రాక్టర్ ముందు భాగంలోని బంపర్ తగిలి రాజ్‌కుమార్‌నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. మిగిలిన ఇద్దరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటనపై అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైవర్ అనుమానాస్పద మృతి



బోయ అంజి (ఫైల్)

బెళుగుప్ప, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విరుపాపల్లికి చెందిన లారీ డ్రైవర్ (38) బోయ అంజి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు ఆలస్యంగా వెలుగు చూసింది. మృతుడి బంధువులు ఆదివారం పోలీసులకు తెలిపిన వివరాల మేరకు బోయ అంజి అనంతపురానికి చెందిన లారీకి డ్రైవర్‌గా వెళుతున్నాడు. కోయంబత్తూరు వద్ద రెండు రోజుల నుంచి ఆంధ్ర లారీ ఆగి ఉండటంతో అక్కడి పోలీసులు ఆరా తీశారు. డ్రైవర్ మృతదేహం ఒక కాలువలో ఉండటాన్ని గమనించారు. అక్కడ లభించిన వివరాల మేరకు విరుపాపల్లి గ్రామస్థులకు సమాచారం అందించారు. హత్య చేశారా? ఏదైనా ప్రమాదం జరిగిందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మృతుడికి భార్య సరస్వతి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెంగతీర్చిన బెండ

దిగుబడి, ధర బాగుండటంతో రైతుల ఆనందం



బెండ పంట

గుత్తిరూరల్, జనవరి12 (ఆంధ్రజ్యోతి): బెండ పంట దిగుబడి, ధరలు ఆశాజనకంగా ఉండటంతో సాగుచేసిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తక్కువ నీటితో సాగు చేసిన బెండ పంటకు మంచి గిట్టుబాటు ధర లభిస్తోంది. మండలంలోని ధర్మాపురం గ్రామానికి చెందిన గోపినాథ్ చౌదరి ఒక ఎకరాలో డ్రిప్ ఆధారంగా బెండ పంటసాగు చేశాడు. సకాలంలో సస్యరక్షణ పద్ధతులు పాటించాడు. దీంతో మంచి దిగుబడి వచ్చింది. రేటు బాగుండటంతో లాభాల చూస్తున్నాడు. విత్తనాలు, సాగు, మందులకు రూ. 20 వేలు వెచ్చించాడు. వారానికి ఒకసారి మందులను పిచికారి చేశాడు. పంట సాగు చేసిన 45 రోజులకే దిగుబడి రావడం ప్రారంభమైంది. ప్రతి రోజూ 400 కిలోలకు పైగా మార్కెట్‌కు తరలిస్తున్నాడు. మార్కెట్‌లో కిలో రూ. 20 నుంచి రూ. 35లు పలుకుతోంది. మిగతా కూరగాయల ధరలు తగ్గినా బెండ రేటు మాత్రం మెరుగ్గానే ఉంది. ప్రస్తుతం 15 కోతలు కోసినట్లు తెలిపాడు. ఇప్పటి దాకా దాదాపు రూ.రెండు లక్షల ఆదాయం వచ్చినట్లు రైతు ఆనందం వ్యక్తం చేశాడు. ఇంక రెండు నెలల పాటు పంట కాస్తుందని, మంచి దిగుబడి వచ్చిన సమయంలో మంచి ధర లభించడం సంతోషంగా ఉందని రైతు ఆనందాన్ని వ్యక్తం చేశాడు.



యువరైతు గోపీనాథ్ చౌదరి

బాబు బంగారం

తైక్వాండోలో భవేష్‌కు పతకం



అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): తైక్వాండో అండర్-10 పోటీలో జిల్లాకు చెందిన భవేష్ బంగారు పతకం సాధించాడు. బాపట్ల జిల్లా రేపల్లెలో ఆదివారం నిర్వహించిన ఏపీ రాష్ట్ర స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్-2025 పోటీల్లో భవేష్ అద్భుతమైన ప్రదర్శన చేశాడు. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో పది వరకు పతకాలు సాధించిన భవేష్ ఈ పోటీలో బంగారు పతకం సాధించడం పట్ల తల్లిదండ్రులు లక్ష్మీనరసప్ప, మమత, కోచ్ మనీంద్ర హర్షం వ్యక్తం చేశారు.

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా..!

● అంతరించిపోతున్న చెట్లు
● పొంచి ఉన్న పర్యావరణ ముప్పు
● మామూళ్ల మత్తులో అటవీ శాఖ అధికారులు

గాండ్లపెంట, జనవరి 12(ఆంధ్రజ్యోతి): చెట్లు మానవుని మనుగడకు జీవ నాడి. ఆ చెట్లనుంచి వచ్చే ఆక్సిజన్ వల్లే మనుషులు జీవిస్తున్నారు. అలాంటి చెట్లను నరికి కలప అక్రమరవాణాతో వ్యాపారులు లక్షలు గడిస్తున్నారు. చెట్లను నరికేవారిని అటవీ అధికారులు అడ్డుకోవాల్సింది పోయి వారికి సహ కరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పచ్చని చెట్లు అంత రించి పర్యావరణానికి ముప్పు పొంచి ఉందని పర్యావరణవేత్తలు వాపోతు న్నారు. మండలంలో కదిరి, రాయచోటి ప్రధాన రహదారిలో నిత్యం కలప అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. కలపను నంబులపూలకుంట, తలు పుల, అలాగే కడప, అన్నమయ్యజిల్లానుంచి ఈ మార్గం గుండా తరలిస్తు న్నారు. మండలంనుంచి కడప జిల్లాలోని వేంపల్లికి కూడా నిత్యం కలప తర లుతున్నట్లు సమాచారం. చెట్లను కొట్టడానికి రెవెన్యూ, అటవీశాఖ అనుమ తులు అవసరం. అయితే ఈ శాఖలకు కలప వ్యాపారులు ముడుపులు ముట్టచెప్పుతుండటంతో వారి వ్యాపారం నిరంతరాయంగా సాగుతోంది. కలప అక్రమ వ్యాపారం కోసం కదిరి నియోజకవర్గ ప్రాంతంలో దాదాపు రెండువందల మంది వ్యాపారులున్నట్లు సమాచారం. ఏడాదికి ఎన్నిచెట్లను నరుకుతున్నారో అధికారుల వద్దకూడా లెక్కలు లేవు. వ్యాపారులు చెట్లు నర కాలంటే అటవీ అధికారులకు రుసుం చెల్లించాలి. అలాంటి రుసుంను అట వీశాఖ, రెవెన్యూ అధికారులు జేబులు నింపుకుంటున్నట్లు విమర్శలున్నాయి. అడవుల్లో దొరికే వనమూలికలను సైతం వ్యాపారులు సొమ్ము చేసుకుంటు న్నారు. కలప అక్రమ రవాణా నిత్యం సాగుతూనే ఉంది. అటవీ అధికారులు మాత్రం ఏ ఒక్కరోజు పట్టుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వం పర్యావరణాన్ని పెంపొందించడానికి రూ.కోట్లు ఖర్చు చేసి మొక్కలు నాటుతున్నారు. ఒక వైపు చెట్లను నరుక్కుంటూ వెళ్తున్నారు. భవిష్యత్‌లో కృత్రిమ ఆక్సిజన్‌పై మనుగడ కొనసాగే పరిస్థితులు నెలకొంటాయని పర్యావరణవేత్తలు అంటు న్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పచ్చనిచెట్లను సంరక్షించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

దిష్టిబొమ్మలా అటవీ శాఖ చెక్‌పోస్టు

మండల పరిధిలోని రెక్కమాను వద్ద కదిరి-రాయచోటి ప్రధాన రహదా రిలో అటవీశాఖ చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఇక్కడ అక్రమ రవాణాను అడ్డుకున్న దాఖలాలు లేవు. ఈ రహదారి గుండా అటు అన్నమయ్య, కడప జిల్లాల నుంచే కాకుండా తలుపుల, నంబులపూలకుంట నుంచి కదిరికి నిత్యం కలప రవాణా సాగుతోంది. ఇక్కడ ముందస్తుగానే సంబంధిత అట వీఅధికారులతో ఒప్పందం కుదుర్చుకుని వ్యాపారులు యథేచ్ఛగా కలపను రవాణా చేస్తున్నారు. దీంతో అటవీశాఖ ఆదాయానికి గండిపడుతోంది. ఇక్కడ చెక్‌పోస్టు ఉన్నా లేనట్లేనని స్థానికులు చర్చించుకుంటున్నారు.



దిష్టిబొమ్మలా దర్శనమిస్తున్న అటవీ శాఖ చెక్‌పోస్టు


కలపను ట్రాక్టర్‌లోకి లోడ్ చేస్తున్న దృశ్యం

వనమూలికలు పక్క రాష్ట్రాలకు సరఫరా

గాండ్లపెంట పరిసర ప్రాంతాల్లోని అటవీ భూముల్లో వనమూలికలు అధికం. వీటిలో నల్లేరు, చిత్రలేరు, కలబంద, ఉస్తికాయలు తదితర పలుర కాల ఔషధ మూలికలను కూలీలతో సేకరిస్తారు. కూలీల వద్దనుంచి వ్యాపా రులు తక్కువ ధరలకు కొనగోలు చేసి, అధిక ధరలకు పక్కరాష్ట్రాల్లో విక్ర యించుకుంటున్నారు. అటవీ అధికారులు మాత్రం ఎలాంటి దాడులు చేసిన పాపాన పోలేదు. వ్యాపారులు, అటవీ అధికారులకు మూడుపులు అప్పగిస్తు న్నట్లు విమర్శలున్నాయి.

కలప అక్రమ రవాణా చేస్తే చర్యలు

అనుమతులు లేకుండా కలపను నరికినా, రవాణా చేసినా, అలాంటివా రిపై చర్యలు తీసుకుంటాం. ఎక్కడా అక్రమ రవాణా చేస్తున్నట్లు తన దృష్టికి రాలేదు. వస్తే వారిపై కఠిన చర్యలు చేపడతాం.

-దామోదర్, సెక్షన్ అధికారి, అటవీశాఖ

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

● మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సీఎన్‌బీ కల్యాణమం డపంలో నాలుగురోజుల క్రితం నిర్వహించిన జాబ్‌మేళాలో ఎంపికైన యువతీయువకులకు నియామకపత్రాలను వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్‌యాదవ్ ఆదివారం పంపిణీచేశారు. స్థానిక బీజేపీ పార్టీ కార్యాల యంలో వివేకానంద 162వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మెగాజాబ్‌మేళాలో ఎంపికైన 1668 మందికి మంత్రి నియామకపత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడు తూ.. యువతీయువకులకు వివేకానందను ఆదర్శంగా తీసుకొని తమ కాళ్లపై తాము నిలబడి వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల న్నారు. తాము ఎంచుకున్న లక్ష్యాన్ని చేరేవరకు ఎంత కష్టమైన సరే సాధించి మిగతావారికి ఆదర్శంగా నిలవాలన్నారు. నియోజకవర్గంలో నిరు ద్యోగులకు నైపుణ్యాలను పెంచుకునేందుకు శిక్షణ ఇచ్చి వారికి ఉద్యోగ అవ కాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభి వృద్ధి సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ, మంత్రి కార్యాలయ ఇన్‌చార్జ్ హరీశ్ బాబు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు జింకాచంద్రశేఖర్, ఎంపీపీ ఆదినారా యణ, సాకేఓబుళేశు, గుండాపుల్లయ్య, భక్తవత్సలం, నబీరసూల్ పాల్గొ న్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రమాదాల బారినపడి మృతిచెందిన కుటుంబాలకు, అనారోగ్యాలతో ఆస్పత్రిలో చికిత్సలు చేయించుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంత్రిసత్యకుమార్‌యాదవ్ ఆదివారం పంపిణీచేశారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆరుగురికి చెక్కులను అందజేశారు.


మంత్రితో ఉద్యోగ నియామకపత్రాలు పొందిన అభ్యర్థులు

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని మంత్రి సత్యకుమార్‌యా దవ్ దృష్టికి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భాస్కర్‌రెడ్డి, రామాంజనేయులు తీసుకెళ్లారు. బీజేపీ కార్యాలయంలో ఆదివారం వారు మంత్రిని కలిసి పలు సమస్యలను వివరించారు. ప్రధానంగా సచివాలయ ఉద్యోగులకు రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, ప్రొబేషన్ డిక్లరేషన్ ఆలస్యం చేయడంవల్ల నష్టపోతున్నారని, జూనియర్ అసిస్టెంట్లకు పేస్కేల్ కల్పించాలన్నారు. ఆదినారాయణ, మల్లికార్జున, ఉద్యోగసంఘాల నాయకులు సాయిప్రకాశ్, ఫక్రుద్దీన్, నట రాజ్, హరిప్రసాద్, ఓబులేశు పాల్గొన్నారు.

భూములు కోల్పోతున్నాం.. న్యాయం చేయండి


వినతి పత్రాలు చూపిస్తున్న బాధితులు

కదిరి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): కుటాగుళ్ల రైల్వే బ్రిడ్జి కారణంగా తాము భూములు కోల్పోతున్నామని, న్యాయం చేయాలని బాధితులు ఆదివారం పత్రాలు చూపుతూ నిరసన తెలిపారు. ఆర్‌అండ్‌బీ బంగ్లా వద్ద బాధితులు మాట్లాడుతూ కుటాగుళ్ల ఆర్వోబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి)కి సంబంధించి మార్కింగ్ ఇచ్చి సంవత్సరాలు గడుస్తోందన్నారు. ఇందుకు సంబంధించి నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. బాధితుల తరపున గత మే నెలలో ఆర్డీవోకు న్యాయం చేయాలని వినతిపత్రం ఇచ్చినా ఇంతవరకు స్పందన లేదన్నారు. దీనిపై కలెక్టర్‌కు కూడా వినతిపత్రం ఇచ్చామన్నారు. తమ సమస్యను ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

అపూర్వ సమ్మేళనం


అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

తనకల్లు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో జరిగింది. 2004-05లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 20 సంవత్సరాల తరువాత ఒక్కచోట కలిశారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఆహ్వానించారు. పండుగ వాతావరణంలో పూర్వ విద్యార్థుల కలయిక కొనసాగింది. ఒకరినొ క్కరు కలుసుకుని యోగక్షేమాలు తెలుసుకుని గత స్మృత్తులు గుర్తుచేస్తు న్నారు. అందరూ కలిసి భోజనం చేశారు. పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ వితరణ చేశారు. అనంతరం అప్పటి గురువులను సన్మానించారు.

50 కోళ్లు, మోటారు చోరీ

ముదిగుబ్బ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కస్తూర్బా కాలనీ సమీపం వ్యవసాయ పొలంలో గుర్తుతెలియని దొంగలు 50 కోళ్లు దొంగలించినట్టు బాధితుడు ఆటో పెద్దన్న తెలిపారు. వ్యవసాయ పొలంలో వ్యవసాయం చేసుకుంటూ అలాగే రేకుల షెడ్డునిర్మించి నాటుకోళ్లను పెంచు కుంటున్నాన్నారు. శనివారం రాత్రివరకు పొలంలోనే ఉన్నానన్నారు. ఆది వారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా రేకుల షెడ్డుకు తాళం పగల కొట్టి అందులో ఉన్న 50 కోళ్లు, వ్యవసాయ మోటారు, తూనికల స్కేలు ఇతర సామగ్రిని దొంగలించారన్నారు. వీటి విలువ రూ.లక్ష ఉంటుందని ఆయనవాపోయాడు. శనివారం కోళ్లు కొనుగోలుచేస్తామని ముగ్గురు వ్యక్తులు పొలం వద్దకు వచ్చారని, అనుమానంగా పొలంలో తిరిగారని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు బాధితుడు తెలిపాడు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

నల్లచెరువు, జనవరి12(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని నల్లగుట్ట వీధిలో మల్లెల మనోహర్ (30) అనే వ్యక్తి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. టీడీపీ నాయకులు వదలపల్లి అబ్దుల్‌ఖాదర్ ఆ కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం రూ.పదివేలు ఆర్థికసాయం అందజేశారు. వైసీపీ నాయకుడు దశరథనాయుడు మృతుడి కుటుంబానికి రూ.పదివేలు ఆర్థికసాయం చేశారు. కుటుంబానికి అండగా ఉంటామని వారు హామీ ఇచ్చారు. వారితోపాటు ముస్తఫా, బాషా, షఫీ, ఆదిమూర్తి పాల్గొన్నారు.

గోకులాలతో రైతులకు ఆసరా: ఎమ్మెల్యే

నల్లమాడ, జనవరి12(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగలో భాగంగా నిర్మిం చిన మినీగోకులాలు రైతులకు ఎంతో ఆసరాగా ఉంటాయని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పాతబత్తపల్లి పంచాయతీ నల్లగుండ యనుములవారిప ల్లిలో రైతులు మల్లికార్జున, రామక్రిష్ణ, నల్లమాడ పంచాయతీలోని డిష్ బాబ్‌జాన్, ఎద్దులవారిపల్లి గ్రామంలో శంకరమ్మ, రామసుబ్బారెడ్డి నిర్మిం చిన గోకులాలను వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ నియోజకవ ర్గంలో 300 గోకులాలు మంజూరు చేశారని తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ రాబర్టు విల్సన్, ఏపీడి జ్యోతి, ఏపీఓ రఘునాథ్‌రెడ్డితోపాటు, ఉపాధి సిబ్బంది, టీడీపీ కన్వీనర్ షైలే శివశంకర్, గడ్డం రమణారెడ్డి, సలాంఖాన్, బుట్టి నాగభూషణ నాయుడు, రాజారెడ్డి పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: గోకులాలతో ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పల్లె మంత్రి పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొండకమర్ల, మహమ్మదాబాద్ క్రాస్‌లో గోకులాలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ నాయకత్వంలో ఉ పాధి పథకం కింద మినీగోకులాలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. జగన్ పాల నలో గ్రామాలను పూర్తిగా నిర్వీర్యం చేశారన్నారు. మండలకన్వీనర్ శెట్టి వారి జయచంద్ర, మాజీ జెడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి, ఆర్ఎంపీ జాకీర్, బడిశం రామాంజి, చెరువు రవీంద్రారెడ్డి, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.


పాతబత్తలపల్లితో గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కబడ్డీ పోటీల విజేతలు ఆర్డీటీ, డీఎస్‌ఏ జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి కబడ్డీ పోటీల విజేతలుగా ఆర్డీటీ, డీఎస్‌ఏ జట్లు నిలిచాయి. వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక అశోక్‌నగర్ డీఎస్‌ఏ ఇండోర్ స్టేడి యంలో వివేకానంద స్పోర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. బాలికల విభాగంలో విజేతగా ఆర్డీటీ స్పోర్ట్స్ విలేజ్ జట్టు, ద్వితీయ స్థానంలో కేఎస్ఆర్ బాలికల జట్టు నిలిచాయి. బాలుర విభాగంలో విజేతగా డీఎస్‌ఏ వివేకానంద జట్టు, ద్వితీయ స్థానంలో ఐ ధర్మవరం ఆర్డీటీ జట్టు గెలుపొందాయి. అంతకు ముందు వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివేకానంద స్ఫూర్తితో యువత అన్ని రంగాల్లో రాణించాలని అధికారులు సూచిం చారు. అనంతరం కస్టమ్స్ అధికారి ఐఆర్ఎస్ లోకనాథ్‌రెడ్డి, విద్యుత్తు శాఖ విజిలెన్స్ సీఐ విశ్వనాథ్‌చౌదరి చేతుల మీదుగా విజేతలకు బహుమ తులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శాప్ కబడ్డీ కోచ్ అనీల్‌కు మార్, కోచ్ సంధ్య, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్‌రెడ్డి, న్యాయవాది మురళీధర్, ఆర్డీటీ రాజశేఖర్‌రెడ్డి, సభ్యులు, పీడీలు, కోచ్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు


డ్రోన్‌తో పరిశీలిస్తున్న ఎస్‌ఐ కృష్ణమూర్తి

బుక్కపట్నం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యకాపాలకు పాల్ప డితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ కృష్ణమూర్తి హెచ్చరించారు. మండలం లోని బుచ్చయ్యగారిపల్లి, గసికవారిపల్లి, పాముదుర్తి గ్రామాల్లో పేకాట, కోడి పందేలు నిర్వహించే ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో ఆదివారం పరిశీలించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. కోడిపందేలు, పేకాట ఆడితే చర్యలు తప్పవన్నారు. ఆయనతోపాటు పోలీసు సిబ్బంది ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు మహోత్సవం

తాడిమర్రి, జనవరి 12(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని సయ్యద్ మహమ్మద్‌షా ఖాద్రి దర్గాలో మొదటి సంవత్సరం గంధం ఉరుసు మహోత్సవం నిర్వహించారు.ఈ సందర్భంగా ముస్లీం మతపెద్దలు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వందలా మంది భక్తులు ప్రార్థనలో పాల్గొని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు ముంటిమడుగు హర్ష పాల్గొని ప్రత్యేకపూజలు చేయించారు. కార్యక్రమంలో బాస్కర్‌గౌడ్, పక్కీర్‌రెడ్డి, శంకరనాయుడు, గణేశ్, నగేశ్ పాల్గొన్నారు.


ప్రార్థనలు చేస్తున్న ముస్లిం మతపెద్దలు

ఘనంగా వివేకానంద జయంతి


వివేకానంద విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న బీసీ నాయకులు

కదిరి అర్బన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): బీసీ మహాజన సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్వామి వివేకానంద జయం తిని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బాలికల పాఠ శాలలోని వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. భారతదేశ నాగరికత, సంస్కృతి, సంప్ర దాయాలు ప్రపంచానికి చాటిచెప్పిన వ్యక్తి స్వామి వివేకా నంద అన్నారు. కె.ఆర్ హరిప్రసాద్, మునికుమార్, ప్రసాద్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

నల్లమాడ: స్థానిక స్వాతి క్లినిక్‌లో స్వామి వివేకానంద జయంతిని ఆదివారం టీడీపీ నాయకులు ఘనంగా నిర్వ హించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. బుట్టి నాగభూషణనాయుడు, మంజునాథ్ రెడ్డి, గుండ్ర శివారెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, బయ్యా రెడ్డి, శివారెడ్డి, రామప్ప, పురుషోత్తం, అశోక్‌కుమార్ పాల్గొ న్నారు.


నల్లమాడలో టీడీపీ నాయకుల నివాళి

పెయింటర్ ఆత్మహత్య

ఓబుళదేవరచెరువు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని బీసీ కాలనీలో ఆదివారం తలుపుల మండలానికి చెందిన పెయింటర్ శేఖర్ ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు రెడ్డివారిపల్లికి చెందిన శేఖర్ నాగేళ్లక్రితం భార్య పిల్లలను వదిలేసి ఒంట రిగా జీవిస్తున్నాడు. నెలరోజులక్రి తం ఓడీసీలోని బీసీ కాలనీకి వచ్చి పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం నివాసము న్న ఇంటి యజ మాని అద్దె అడగడానికి వెళ్లగా శే ఖర్ పైకప్పు నకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించాడు. పోలీసులకు సమాచారం అందిం చారు. మృతుడి తల్లి రామలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

బత్తలపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండ లంలోని తంబాపురం వద్ద ఆదివారం స్కూటీని కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు డి.చెర్లోపల్లికి చెందిన ప్రశాంత్‌కుమార్ తన చెల్లెలు తేజశ్వనితో కలసి స్కూటీలో బత్తలపల్లి నుంచి సొంత గ్రామానికి వెళుతుండగా తంబాపురం వద్దకు రాగానే ఎదు రుగా వస్తున్న కారు ఢీకొనడంతో ఇద్దరూ గాయ పడ్డారు. వీరిని అటుగా వెళుతున్న వారు ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండ టంతో అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

న్యూస్ బాక్స్

దళితులు బలోపేతం కావాలి

● దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బారావు



మాట్లాడుతున్న సుబ్బారావు

కదిరి అర్బన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): దళితులు అన్నిరంగాల్లో బలోపేతం కావాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బారావు అన్నారు. ఆదివారం సీపీఐ అనుబంధ దళిత హక్కుల పోరాట సమితి జిల్లా మహాసభ పట్టణంలోని ఎన్‌జీవో కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి. రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్, రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిండెంట్ కాటమయ్య, వ్యవ సాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కేశవరెడ్డి హాజర య్యారు. సుబ్బారావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అవుతున్నా, ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా దళితులు వెనుకబడి ఉన్నారన్నారు. వారిపై కులవివక్ష చూపుతూ దాడులు, అత్యాచారాలు చేస్తున్నారని బాధపడ్డారు. దళితులందరూ సమష్టిగా బ లోపేతం కావాలన్నారు. దళితులపై జరుగుతున్న దాడు లను ప్రభుత్వాలు అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఉపా ధ్యక్షులు గురుదాస్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సురేంద్ర, కార్యదర్శి ఆంజనేయులు, ఆటో యూనియన్ నాయకుడు మధునాయక్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శేషం మహేంద్ర, సీపీఐ పట్టణ కార్యదర్శి లియాఖత్ పాల్గొన్నారు.

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం చేయండి

ధర్మవరం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వేలకోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై వేసిందని, ఇందుకు నిరసనగా భోగి మంటల్లో ఆ బిల్లులను దహనం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి రాంభూ పాల్.. ప్రజలకు పిలుపు నిచ్చారు. స్థానిక పార్టీ కార్యాల యంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎలెక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ పేరుతో రూ.15వేల కోట్ల విద్యుత్ చార్జీలను పెంచిందన్నారు. వచ్చే మార్చి నుంచి మరో రూ.14వేల కోట్ల భారం వేయ డానికి సిద్ధమవుతోందని విమర్శించారు. విద్యుత్ భారా లకు గత వైసీపీ ప్రభుత్వం కారణమైతే ఎందుకు సెకి ఒప్పందం రద్దుచేయడం లేదని ప్రశ్నించారు. ఒకవైపు సంక్షేమ పథకాలు కుదించి మరో వైపు భారాలు వేయ డంపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందన్నారు. అదానీ కంపెనీల లాభాల కోసం ప్రజలను మభ్యపెట్టే విధానాలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న, నాయకులు ఎస్‌హెచ్ బాషా, మారుతి, జేవీ రమణ పాల్గొన్నారు.

వజ్ర చౌడేశ్వరీదేవి కట్ట ప్రారంభం


కట్టను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డీఎల్ఆర్ కాలనీలో నూతనంగా నిర్మించిన వజ్ర చౌడే శ్వరిదేవి కట్టను టీడీపీ నాయకులు ఆదివారం ప్రారంభిం చారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, తొగట వీర క్షత్రియ పట్టణ అధ్యక్షుడు రాము అమ్మవారి కట్టను ప్రారంభించారు. కార్యక్రమంలో భీమనేని ప్రసాద్‌నా యుడు, మాధవరెడ్డి, గంగాధర్, మల్లికార్జున, శివరాం, వాసు పాల్గొన్నారు.

రేపు అయ్యప్ప అఖండ జ్యోతి

ఓబుళదేవరచెరువు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం. కొత్తపల్లి బండపై వెలసిన అయ్యప్ప ఆల యంలో మంగళవారం స్వామి అఖండజ్యోతి పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ సంకల్పకులు పచ్చర్ల ఆంజనేయులనాయుడు తెలిపారు. కార్యక్రమా నికి భక్తులు అధిక సంఖ్య తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.


అయ్యప్ప మూలవిరాట్టు

వివేకానంద స్ఫూర్తితో ముందుకు సాగుదాం


స్నేహితుడి కుటుంబానికి సరుకులు అందజేస్తున్న సభ్యులు

తాడిమర్రి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): స్వామి వివేకా నంద స్ఫూర్తితో ముందుకు సాగుదామని పూర్వ విద్యా ర్థులు పిలుపునిచ్చారు. స్థానిక ఉన్నత పాఠశాలలో 1991- 92లో పదో తరగతి చదివిన విద్యార్థులు స్ఫూర్తి ఫౌండేషన్ పేరుతో ప్రతిఏడాది వారి బ్యాచ్‌లో పేద స్నేహితులకు సాయంఅందించడం ఆనవాయితీగా పెట్టు కున్నారు. వివేకానంద జయంతిని పురస్కరించుకుని పాఠశాలలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివా ళులర్పించారు. అనంతరం మిత్రబృందం నాయనపల్లికి చేరుకుని వారి స్నేహితులైన మహబూబ్‌బాషాకు 4 బస్తాల బియ్యం, రూ.5వేలు నగదు అందజేశారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళి

బుక్కపట్నం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాముదుర్తి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త, మాజీ డీలర్ లక్ష్మీనారాయణ శనివారం మృతచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆదివారం ఆయన మృతదేహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన మృతి పార్టీకి తీర నిలోటన్నారు. జ్యోతిక్రిష్ణమూర్తి, మల్లిరెడ్డి పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

పాడి రైతులకు ముఖ్యమంత్రి పెద్దపీట



గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న వెంకటేశ్వర రావు

పెనుకొండ రూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ఐదేళ్ల పాలనలో పాడి రైతులకు జగన్మోహన్‌రెడ్డి తీవ్ర అన్యాయం చేశారని, కూటమి ప్రభుత్వం కొలువు తీరగానే గ్రామాల్లో పాడి రైతులకు గోకులం షెడ్లను నిర్మించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు పెద్దపీట వేశారని టీడీపీ సీనియర్ నాయకులు వెంకటేశ్వర్‌రావు, మండల కన్వీనర్ సిద్దయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆదివారం మండలంలోని రాంపురం పంచాయతీ కొండంపల్లి గ్రామంలో అధికారులు, నాయకులు ఘనంగా పల్లె పండగ వారోత్సవాలు జరుపుకున్నారు. ఉపాధి హామీ పథకం కింద కొండంపల్లి గ్రామంలో చంద్రనాయక్ రూ.2.30లక్షలతో నిర్మించిన గోకులం షెడ్డును వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జయమ్మ, సర్పంచ్ శ్రీనివాసులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పరిగి: మండలంలోని శ్రీరంగరాజులపల్లిలో ఆదివారం టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి గోకులం షెడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఆదేశాల మేరకు ఉపాధిహామీ నిధులతో నిర్మాణం చేసిన గోకులం షెడ్డును ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో వెటర్నరి వైద్యుడు జానర్దన్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

కురుబవాండ్లపల్లిలో మాజీ మంత్రి



గుడ్‌మార్నింగ్ కార్యక్రమంలో వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష

పెనుకొండ రూరల్, జనవరి12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుబవాండ్లపల్లిలో వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ గుడ్‌మార్నింగ్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఉదయం వైసీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రతి వీధిలో గుడ్‌మార్నింగ్ కార్యక్రమం నిర్వహించి ప్రజలను పలకరించారు. కార్యక్రమంలో బోయ వాల్మీకి చైర్మన్ పొగాకు చంద్ర, కౌన్సిలర్ సుధాకర్ రెడ్డి, నాయకులు జయశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల విజేతలు ఆర్డీటీ, డీఎస్‌ఏ జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి కబడ్డీ పోటీల విజేతలుగా ఆర్డీటీ, డీఎస్‌ఏ జట్లు నిలిచాయి. వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక అశోక్‌నగర్ డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో వివేకానంద స్పోర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించారు. బాలికల విభాగంలో విజేతగా ఆర్డీటీ స్పోర్ట్స్ విలేజ్ జట్టు, బాలుర విభాగంలో విజేతగా డీఎస్‌ఏ వివేకానంద జట్టుగెలుపొందాయి.

ముగిసిన ఉచిత వైద్యశిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

పెనుకొండ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త డా.సాయికాళేశ్వర్ జయంతిని పురస్కరించుకుని షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు నిర్వహించిన ఉచిత వైద్యశిబిరం ఆదివారంతో ముగిసింది. వైద్య శిబిరంలో వైద్యులు డా.సుసానే, క్రిష్టియన్, రమ్య, మోసస్, రిచర్డ్, ఫ్రాంక్లిన్, రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో మొత్తం 650మంది ఈఎన్‌టీ రోగులను పరీక్షించి 321మందికి వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. 350మంది చర్మవ్యాధి గ్రస్తులను, 160మంది పంటి రోగులను 175మంది ఫిజియోథెరపీ పరీక్షలు నిర్వహించినట్లు నిర్వాహకులు చిట్టిబాబు, హరి, బాబుప్రసాద్‌లు తెలిపారు

మైనేనికి ఘన నివాళి

పెనుకొండ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ ఆవిర్భావ నిర్మాతల్లో ముఖ్యుడైన మైనేని వెంకటరత్నం వర్ధంతిని యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఎంఎస్‌ఆర్ రెసిడెన్సీలో రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో నాయకులు.. మైనేని చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. తుదకు ఉపాధ్యాయుల సేవలోనే ఆయన తుదిశ్వాస విడిచారన్నారు. ఆయన సేవలోనే నేటితరం నాయకులు ఆచరించే విధంగా చూడాలన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



మంత్రి సవితను కలిసిన గెస్ట్ టీచర్లు

పెనుకొండ టౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిరావుపూలే బీసీగురుకుల పాఠశాలల్లోని అతిథి ఉపాధ్యాయ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవితకు విన్నవించారు. ఆదివారం స్థానికపార్టీ కార్యాలయంలో 240మంది కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చి మంత్రి సవితను కలిశారు. ఈ సందర్భంగా వారి సమస్యలను మంత్రికి వివరించారు.

నేడు బనశంకరీదేవి ఆలయ వార్షికోత్సవం

అమరాపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని హాలుకూరు గ్రామంలో వెలసిన శ్రీబనశంకరీదేవి ఆలయ వార్షికోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించనున్నట్లు బనశంకరీదేవి యువ సంఘం నాయకులు తెలిపారు.

సందడే.. సందడి



పెనుకొండలో రంగుల కొనుగోలు



పోటీలో మొదటి స్థానం పొందిన ముగ్గు



రంగులు, చెరకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

పెనుకొండ/పావగడ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా ఎటుచూసినా పండగ సందడి నెలకొంది. ఆదివారం వారపు సంతలో పండగకు అవసరమైన పూలు, పండ్లు, చెరుకుగడలు, అనపకాయలు, గుమ్మడికాయలు, ముగ్గులు వేసే రంగులు, తదితర వస్తువుల కొనుగోలుకు పట్టణ ప్రజలతోపాటు గ్రామీణులు తరలిరావడంతో పెనుకొండలో దుకాణాలన్నీ కిటకిటలాడాయి. అలాగే పావగడ తాలూకా వ్యాప్తంగా పండగ శోభ వెల్లివిరుస్తోంది. పావగడ పట్టణంలోని శనిమహాత్మ సర్కిల్‌లో పండుగ సామాన్లు కొనడానికి ప్రజలు ఎంతగానో ఆసక్తి చూపారు. అదేవిధంగా సాయిబాబా ఆలయం ముందు ముగ్గుల పోటీలో వంద మందికిపైగా పాల్గొన్నారు. నవధాన్యాలతో కూడిన గంగిరెద్దులు, గొబ్బెమ్మలు, పాడి రైతు తదితర బొమ్మలతో వేసిన ముగ్గులకు బహుమతులు లభించాయి.

కల్తీ ముప్పు!

- తినుబండారాల్లో రంగుల వాడకం
- ఆకర్షణ, రుచి కోసం రోగాల బారిన ప్రజలు
- తెలిసినా పట్టించుకోని అధికారులు



ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న అధికారులు(ఫైల్)

హిందూపురం అర్బన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఇది కలి కాలం, కల్తీ కాలం. ఏ వస్తువు తీసుకున్నా అంతా కల్తీనే. చిన్న పిల్లలు తాగే పాల దగ్గర నుంచి పెద్దలు తాగే మందు వరకు కల్తీనే. నిత్యం ప్రజలు తినే ఆహారం, ఆఖరికి తాగునీరు కూడా కల్తీచేసి విక్రయిస్తున్నారు. డబ్బు సంపాదనే ధ్యేయంగా వ్యాపారాలు చేస్తున్నారు. ఇది అది అని కాదు ఏ వస్తువైనా నకిలీనే. ఒరిజినల్ కంటే నకిలీ వస్తువులే ఆకర్షణీయంగా ఉండేలా తయారు చేస్తున్నారు. ఉదయం లేవగానే పళ్ల శుభ్రం చేసుకునే పేస్ట్‌తోనే కల్తీ ప్రారంభమవుతుంది. తరువాత అల్పాహారం, టీ ఇలా ప్రతివస్తువు అంతే. ఓ వైపు పశుసంపద తగ్గిపోతూంటే మార్కెట్‌లో పాలపాకెట్లు వెల్లు వెత్తుతున్నాయి. ఇది ఎలా సాధ్యం. నిత్యం తాగే నీటిని మినరల్‌వాటర్ అని అమ్ముతున్నారు. నిజంగా అందులో మినరల్స్ ఉన్నాయా? లేదా? అని ప్రజలకు తెలియదు. సంబంధిత అధికారులు వాటిని చెక్ చేయరు. ఇప్పుడు నీటి రుచి కోసం చాల మంది పిల్స్ వాడుతున్నట్లు నీటి ట్యాంకర్ల డ్రైవర్‌లే మాట్లాడుకోవడం విశేషం. కొళాయిల్లో వచ్చే నీటిని కాచి చల్లార్చి తాగితే మంచిదని చెబుతున్నారు. అయితే సాధారణ మానవుడు మినరల్ నీటికి అలవాటు పడ్డాడు. దీంతో వ్యాపారులు కల్తీనీరు విక్రయిస్తున్నారు. నిత్యం వంటలకు నూనె వాడుతున్నారు. అవి నిజంగా మంచివేనా? అని అడిగితే కాదనే చెప్పవచ్చు. ఎందుకంటే ఉదాహరణకు ఒక కేజీ శనగ విత్తనాల నుంచి నూనె తీస్తే దాని నుంచి వచ్చేది కేవలం 300 గ్రాములే. ఈ లెక్కన దాదాపుగా 4 కేజీల శనగ విత్తనాలు గానుగలో ఆడిస్తే కేజీ నూనె వస్తుంది. అంటే కేజీ విత్తనాలు ధర కేజీకి రూ. 120 అనుకున్నా 4 కేజీలకు రూ. 480 అవుతుంది. మరి నూనె మాత్రం రూ. 160కే లీటరు ఎలా ఇస్తున్నారు? అంటే అది కేవలం కల్తీనే అని అర్థం అవుతూనే ఉందిగదా! ఇక హోటల్‌లలో తిను బండారాలు రోడ్డు పక్కన జోరుగా విక్రయిస్తుంటారు. వాటికి ఆకర్షణ కోసం రంగులు కలిపి విక్రయిస్తున్నారు. దీంతో శ్వాసకోస వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతారు. రంగులకు ఆకర్షితులైన చిన్నారులు విపరీతంగా ఆసుపత్రుల్లో చేరుతున్నారు. మాంసం తినే అలవాటు ఉన్న వారి పరిస్థితి మరీ దారుణం. ఎదుగుదల కోసం బాయిలర్ కోళ్ళకు ఇంజక్షన్‌లు వేసి మరీ విక్రయిస్తున్నారు. ఇలాంటి ఆహారం తినడంతో చిన్నారులతో పాటు పెద్దలకు ఆరోగ్య సమస్యలు వస్తాయని వైద్యులు సూచిస్తున్నా రుచికి అలవాటు పడి ఆరోగ్యాన్ని పాడు చేసుకొని ఆసుపత్రికి వెళ్తున్నారు. కొన్ని ఆహార పదార్థాల వల్ల క్యాన్సర్‌లాంటి భయంకర వ్యాధులు సంక్రమిస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు ఉదాసీనంగా ఉన్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే లేదా పత్రికల్లో వార్తలు వచ్చినపుడు మాత్రం ఆహార భద్రతా నియంత్రణ అధికారులు, శానిటేషన్ అధికారులు మాత్రం ప్రతి నెల చేతులు తడుముకొని వెళ్ళిపోతున్నారని బహిరంగంగా ప్రజలు చర్చించుకుంటున్నారు. వారు సరిగ్గా తనిఖీలుచేస్తే ఇలాంటి కల్తీలు జరుగు తాయా? ప్రాణాలు పోతే కానీ ప్రభుత్వం, ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌లు స్పందించరేమో?

నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు



ప్రజల ప్రాణాలే ముఖ్యం. నిబంధనలు పాటించని వారిపైన చర్యలు తప్పవు. వీధివీధినా పుట్టగొడుగుల్లా మినరల్ వాటర్‌ప్లాంట్‌లు వెలుస్తున్నాయి. వాటి నుంచి శాంపుల్స్ సేకరించి గుంటూరు ల్యాబ్‌కు పంపుతాము. వ్యత్యాసాలు వస్తే చర్యలు తప్పవు. నూనెదుకాణాలపై కూడా దాడులు చేస్తాం.

తస్లీం, ఫుడ్ ఇన్‌స్పెక్టర్

ఉత్సాహంగా యువకుల క్రికెట్

- మడకశిరకు సంక్రాంతి శోభ



గెలుపొందిన ఎలైట్ ఈగల్ టీం

మడకశిర రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) ఉద్యోగరీత్యా ఎన్నేళ్లుగా ఇతర ప్రాంతాలకు వెళ్ళిన గ్రామీణ యువకులు సంక్రాంతికి తిరిగి స్వగ్రామాలకు చేరుకుంటున్నారు. వారంతా మూడురోజులు ముందుగానే గ్రామాలకు చేరుకుని ఆప్యాయంగా ఒకరినొకరు పలకరించుకుంటూ ఎంతో ఉత్సాహంగా గడుపుతున్నారు. మండలంలోని గౌడనహళ్ళి పంచాయితీ పరిధిలోని గౌడనహళ్ళి, జమ్మానిపల్లి, తురుకువాండ్లపల్లి గ్రామాలకు చెందిన యువకులు అందరూ కలిసి టీమ్‌గా ఏర్పడి ఆదివారం గౌడనహళ్ళి ఉన్నత పాఠశాల మైదానంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ప్రీమియర్ లీగ్‌లో ఎలైట్ ఈగల్ టీం ఘనవిజయం సాధించింది. మొదట మ్యాచ్‌లో కాలనీ సూపర్ స్టార్ మచ్చా వారియర్స్‌పై విజయం సాధించగా రెండవ మ్యాచ్‌లో ఎలైట్ ఈగల్ టీం ఎనిమిది ఓవర్లకు 112 పరుగులు చేసింది. ఫ్రెండ్స్ లెవెన్ జట్టు ఛేజింగ్‌లో 99 పరుగులు చేసి ఓటమిపాలైంది.



ఉల్లాసంగా గడుపుతున్న యువకులు

స్నేహితులను కలవడం ఎంతో సంతోషం: లోకేశ్, ఐటీ ఉద్యోగి

సంక్రాంతి పండుగకు మా ఊరు తురుకువాండ్లపల్లికి వచ్చాను. స్నేహితులతో కలిసి మూడు రోజులుగా ఉత్సాహంగా గడుపుతున్నాను. ఈ సంక్రాంతితో పండుగకు స్నేహితులందరితో క్రికెట్ ఆడడం మరీ ఆనందంగా ఉంది..

భారతీయుల ఆధ్యాత్మిక దిక్సూచి స్వామి వివేకానంద

- జయంతి కార్యక్రమంలో మంత్రి సవిత

గోరంట్ల, జనవరి12 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద యువతకు ఆధ్యాత్మిక దిక్సూచి అని రాష్ట్ర చేనేత జౌళి శాఖల మంత్రి సవిత పేర్కొన్నారు. ఆదివారం గోరంట్లలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయలో స్వామి వివేకానంద జయంతి కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మండల కూటమి నాయకులతో కలసి స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో కన్వీనర్ సోముశేఖర్, నాయకులు, కార్యకర్తలున్నారు.

హిందూపురం అర్బన్: భారతీయులకు స్వామి వివేకానంద స్ఫూర్తి దాయకమని బీజేపీ తిరుపతి జిల్లా ఇన్‌చార్జి పార్థసారథి అన్నారు. పట్టణ పరిధిలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఆదివారం స్వామి వివేకానంద



వివేకానందుడి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు



స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో పాల్గొన్న మంత్రి సవిత

162 జయంతి వేడుకలను బీజేపీ పట్టణ పట్టణాధ్యక్షుడు ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సెంట్రల్ సీడ్స్ అగ్రికల్చర్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

పెనుకొండ టౌన్: యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తులో రాణించాలని కన్వీనర్ శ్రీరాములు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అన్నా క్యాంటిన్‌లో వివేకానంద చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో చిన్న వెంకటరాముడు, రమణమ్మ, బాబుల్‌రెడ్డి, చంద్రకాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి అనూహ్య స్పందన

అమరాపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): అమరాపురం మండల పరిధిలోని కె.శివరం గ్రామంలో డాక్టర్ ధనుంజయ ఆధ్వర్యంలో ఎస్‌ఎస్‌ఎం హాస్పత్రి బెంగళూరు వారిచే ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ఉచిత వైద్య శిబిరంలో ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకొన్నారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో ప్రజలు అధికంగా పాల్గొని రక్త పరీక్ష, బీపీ, షుగర్, తదితర రోగాలకు సంబంధించిన వాటికి పరీక్ష చేయించుకోవడం జరిగింది. ఈశిబిరంలో పాల్గొన్న వారికి ఉచితంగా మందులను పంపిణీ చేయడం జరిగింది.

కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు

గుడిబండ, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా మండలంలో కోడిపందాలు, గ్యాంబ్లింగ్, మట్కా, తదితర కార్యకలాపాలు నిర్వహిస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని ఎస్‌ఐ రాజకుళ్లాయప్ప తెలిపారు. గ్రామాల్లో ప్రజలు గొడవలు, ఘర్షణలు లేకుండా పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. చట్టాన్ని అతిక్రమిస్తే అలాంటి వారిపై కఠినచర్యలు తీసుకుంటామన్నారు. కోడి పందాలు, జూదాలు ఆడితే వారిని అరెస్ట్‌చేసి శిక్షపడేలా చేస్తామని హెచ్చరించారు.

శబరిమలకు బయలుదేరిన అయ్యప్పభక్తులు

రొళ్ల, జనవరి12 (ఆంధ్రజ్యోతి):రొళ్లమండలం మల్లినమడుగు గ్రామానికి చెందిన అయ్యప్పస్వాములు ఆదివారం శబరిమలకు బయలుదేరారు. మూడురోజుల దీక్షల అనంతరం స్థానిక లక్ష్మీదేవి దేవాలయంలో గురు స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వాములకు ఇరుముడి కట్టారు. స్థానికులు అయ్యప్ప స్వాములకు ముడుపులు, కానుకలను అందజేశారు.

వాల్మీకుల అభివృద్ధికి పోరాడుదాం



ఎన్నికైన కమిటీతో వాల్మీకి కులస్థులు

హిందూపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): వాల్మీకుల అభివృద్ధికి కులస్థులందరూ ఐక్యంగా పోరాటం చేద్దామని నూతనంగా ఎన్నికైన కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. వారంతా ఆదివారం హిందూపురంలోని వాల్మీకి భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకోవడానికి విజయ్‌కుమార్, నరసింహమూర్తి, ఆకుల సూర్య నారాయణ ఎన్నికల పర్యవేక్షకులుగా వ్యవహరించారు. వాల్మీకి సంఘం హిందూపురం నియోజకవర్గ అధ్యక్షులుగా ఎస్. వెంకటరాముడు, కార్యదర్శిగా ఎస్ నరసింహమూర్తి, కోశాధికారిగా ఆకుల సూర్యనారాయణ, గౌరవాధ్యక్షులుగా ఎం. ఆదినారాయణప్ప, ఆర్గనైజింగ్ కార్యదర్శి లోకేష్, న్యాయ సలహాదారునిగా కొల్లకుంట శివశంకర్, ఉపాధ్యక్షులుగా రాజు, శ్రీనివాసులు, డీఆర్‌జి శ్రీనివాసులు, సంజీవప్ప, నరసింహమూర్తి, మేస్త్రి లింగప్పలు సంయుక్త కార్యదర్శులుగా అశ్వర్థనారాయణ, కొట్నూరు శేఖర్, కిరికెర అంజి, లింగేష్, రంగప్పలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కమిటీ మూడేళ్లపాటు ఉంటుందన్నారు. నూతనంగా ఎంపికైన కమిటీ అధ్యక్షులు మాట్లాడుతూ వాల్మీకుల సమస్యలపై అందరూ ఐక్యంగా ఉండి పోరాటం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి, కౌన్సిలర్ డీఈ రమేష్, మాజీ జెడ్పీటీసీ ఆదినారాయణ, సంతేబిదునూరు శ్రీరాములు, పూలకుంట సర్పంచ్ మంజునాథ్, వీవర్స్‌కాలనీ ఆంజనేయులు, నియోజకవర్గంలోని వాల్మీకులు పాల్గొన్నారు.

ఆసుపత్రి కమిటీ మాజీ చైర్మన్ మృతి



జేఈ వెంకట స్వామి (ఫైల్)

మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎంపీ బీకే పార్థసారథి

హిందూపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్, సాధుచెట్టి సంఘం మాజీ అధ్యక్షులు జేఈ వెంకటస్వామి ఆదివారం ఉదయం తుదిశ్వాస వదిలారు. అనారోగ్యంతో బాధపడుతూ గురువారం బెంగళూరులోని ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందారు. ఈయన సాధుచెట్టి కులస్థుల కోసం సుదీర్ఘంగా కృషిచేశారు. పరిగి రోడ్డులో ఉన్న కంచికామాక్షి కళ్యాణమండపాల ఏర్పాట్లలో కీలకపాత్ర పోషించారు. సుమారు 40ఏళ్లుగా రాజకీయాల్లో ఉంటూ కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘంగా పనిచేశారు. సమైక్యాంధ్ర ఉద్యమం తరువాత కాంగ్రెస్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. గత తెలుగుదేశం హయాంలో హిందూపురం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా అవకాశం ఇచ్చారు. ఆసుపత్రి అభివృద్ధికి కూడా తనవంతు కృషిచేశారు. విషయం తెలుసుకుని ఎంపీ బీకే పార్థసారథి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, తాడిపత్రి మునిసిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి.. హిందూపురానికి వచ్చి ఆయన మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ ఫోన్‌లో జేఈ వెంకటస్వామి కుమారుడు మునిసిపల్ మాజీ చైర్మన్ జేవీ అనిల్‌కుమార్‌కు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వీరితోపాటు పలువురు నేతలు ఫోన్‌లో కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. వెంకటస్వామికి భార్య జయమ్మ, కుమారులు అనిల్‌కుమార్, వేణు, కుమార్తె రాధిక ఉన్నారు

హెంజేరు సిద్దేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

అమరాపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హేమావతి గ్రామంలో హెంజేరు సిద్దేశ్వరస్వామి వారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారికి వివిధ అభిషేకాలు, కుంకుమార్చన, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, తైలాభిషేకం జరిపి ప్రత్యేక అలంకరణ చేసి వెండి కవచం ధరించి మహా మంగళహారతి ఇచ్చి తీర్థప్రసాదాలను వినియోగించారు. అదేవిధంగా స్వామి వారి ఆలయప్రాంగణంలో ఉన్న శ్రీకాలభైరవేశ్వరస్వామి, శ్రీదొడ్డేశ్వరస్వామి, శ్రీమల్లేశ్వరస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు శివకుమార్‌స్వామి, సిద్దలింగేశ్వరస్వామి, మహేష్ కుమార్, గౌతమ్, ప్రదీప్‌లు తెలిపారు. స్వామివారి సేవలో నిమగ్నులైన భక్తులకు సిద్దేశ్వరస్వామి దర్శనభాగ్యం కల్పించారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ కరేగౌడ్ అన్నదానం ఏర్పాటు చేశారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జనవరి12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగిరెడ్డిపల్లికి చెందిన గోపాల్ కుటుంబ కలహాలతో క్రిమిసంహారక మందుతాగి ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఓబులేసుకుమారుడైన గోపాల్ కిరణా దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆర్థిక పరమైన సమస్యలతో కుటుంబ సభ్యులతో విభేదించిన గోపాల్ మనస్థాపానికి గురైనట్లు బంధువులు తెలిపారు. వంకాయ మొక్కలకు కొట్టే పురుగు మందును మద్యంలో కలిపి సేవించిన్నట్లు చెప్పారు. అస్వస్థతకు గురైన ఆయనను ఆటోలో గోరంట్ల ప్రభ్యు ఆసుపత్రికి తరలించగా, డాక్టర్ ఉషా చికిత్సలు చేసి, మెరుగైన చికిత్స కోసం 108లో హిందూపురంకు తరలించారు.